సాక్షి
రాజన్న సిరిసిల్ల

ఆదివారం । 26 । మార్చి । 2023



రాజన్న సేవలో చీఫ్ జస్టిస్

వేములవాడ: రాజన్నను శనివారం హైకోర్టు చీఫ్ జస్టిస్ కుటుంబం, రిజిస్ట్రార్ జనరల్ జస్టిస్ సుజన దర్శించుకున్నారు. వారి వెంట జిల్లా జడ్జి ప్రేమలత, వేములవాడ జడ్జి ప్రతీక్‌సిహాగ్ ఉన్నారు.



నంది వాహనంపై విహరింపు

వేములవాడ: రాజన్న సన్నిధిలో సీతారామచంద్ర స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామివారలను నంది గరత్మంతుడు వాహనంపై ఊరేగించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0/23.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

రంజాన్ వేళలు

పవిత్రమైన రంజాన్ రోజులు శాంతి సందేశం అందించాలి. ప్రపంచ శాంతికి దోహదం చెయ్యాలి.

- మహమ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
శని 6:32	ఆది 4:51

ఇడ్లీవడ.. దోశ!

Sunday Special





'రాజేశ్ కరీంనగర్ నగరంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉద్యోగం చేస్తుంటాడు. నిత్యం ఉదయం తొమ్మిది గంటలకే విధులకు హాజరుకావాల్సి ఉంటుంది. 20 కిలోమీటర్ల దూరంలో ఉండే ఇంటి నుంచి ఉదయం ఎనిమిది గంటలకే లంచ్ బాక్స్‌తో సహా వచ్చేస్తాడు. మధ్యాహ్నం వరకు ఆకలికి ఆగడం కష్టమని పాఠశాలకు సమీపంలో ఉన్న ఓ టిఫిన్ సెంటర్‌లో రోజూ అల్పాహారం చేసి వెళ్తుంటాడు. రాజేశ్ ఒక్కడే కాదు.. ఇలా ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా 40 వేలకు పైగా మంది పొద్దున్నే టిఫిన్ సెంటర్లలో కడుపు నింపుకుంటున్నారు'.

'కరీంనగర్‌లో నివాసం ఉంటున్న మహేందర్ ఫ్యామిలీతో పొద్దున్నే ఊరెళ్లాలి. దూర ప్రయాణం చేయాల్సి ఉంది. తినేందుకు ఇంట్లో టిఫిన్ తయారు చేయాలంటే ఆలస్యం అవుతుంది. దీంతో ఉదయాన్నే టిఫిన్ సెంటర్‌కు వెళ్లాడు. రెండుమూడు రకాల టిఫిన్లు పార్సిల్ తీసుకున్నాడు. అరగంటలో టిఫిన్ తిని బస్టాండ్‌కు పిల్లలతో సహా బయల్దేరారు. ఒక్క మహేందరే కాదు.. ఉమ్మడి జిల్లా పరిధిలో ఇలా రోజూ పది వేల మందికి పైగా టిఫిన్లు హోటళ్ల నుంచి పార్శిల్స్ తీసుకెళ్తున్నారు.'

- మార్నింగ్ టిఫిన్ బయటనే..
- మారుతున్న ఉమ్మడి జిల్లావాసుల అభిరుచి
- పట్టణాల్లో పెరుగుతున్న టిఫిన్ సెంటర్లు
- కరీంనగర్‌లో ఇడ్లీ వడ.. సిరిసిల్లలో పూరి..
- జగిత్యాల, పెద్దపల్లిలో దోశ ఫేవరెట్ ఫుడ్
- మిల్లెట్‌ఫుడ్‌కు పెరుగుతున్న డిమాండ్

జీవనయానంలో ఉరుకులు.. పరుగులు సాధారణమైపోయాయి. సమయంతో పోటీపడుతూ.. అంతా రెడీమేడ్ అన్నట్లు తయారైంది. పొద్దున్నే లేవడం.. రెడీ కావడం.. విధులకు బయల్దేరడం.. దారిలో ఇంత టిఫిన్ చేయడం కాలచక్రంలో భాగమైపోయింది. ఈ క్రమంలో టిఫిన్ సెంటర్లకు ఇప్పుడు మంచి డిమాండ్ ఏర్పడింది. టిఫిన్ సెంటర్లకు వెళ్లడం.. నచ్చింది కడుపునిండా తినడం పనులకు వెళ్లడం అలవాటైపోయింది. ఇందులో ఉమ్మడి జిల్లావాసులు భిన్నరుచులు ఇష్టపడుతున్నారు. కరీంనగర్ జిల్లావాసులు ఎక్కువగా ఇడ్లీ-వడ కాంబినేషన్‌ను ఇష్టపడుతుండగా.. రాజన్న సిరిసిల్ల జిల్లావాసులు పూరి ఎక్కువగా తింటున్నారు. ఇక జగిత్యాల.. పెద్దపల్లిలో దోశ అంటే మక్కువని చెబుతున్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో పొద్దున్నే ఘుమఘుమలాడే అల్పాహార రుచులు.. జిల్లావాసుల అభిరుచులపై సండే స్పెషల్..!! - సాక్షి, కరీంనగర్ డెస్క్

అడుగుకో టిఫిన్ సెంటర్..

ఇప్పుడు పరిస్థితి కరోనా ముందు.. కరోనా తరువాత అన్నట్లు తయారైంది. కరోనా తరువాత ఆహార సంబంధ వ్యాపారాలు ఉమ్మడి జిల్లాలో చాలా బాగా నడుస్తున్నాయని పలువురు చెబుతున్నారు. గతంలో పట్టణాల్లో వాడకో రెండు టిఫిన్ సెంటర్లు ఉండగా.. ఇప్పుడు కనుచూపుమేరలోనే రెండు మూడు దర్శనమిస్తున్నాయి. చిన్నతోపుడు బండి నుంచి మొదలుపెడితే.. పెద్దపెద్ద అద్దాల భవనాలలోనూ టిఫిన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో ఒక్కోచోట ఒక్కో ప్రత్యేకమైన టిఫిన్‌ను తయారు చేస్తూ వినియోగదారులను ఆకర్షిస్తున్నారు. టిఫిన్ సెంటర్లను బట్టి రూ.20 నుంచి రూ.70 వరకు ధరలు ఉంటున్నాయి. కరీంనగర్ జిల్లా కేంద్రంలో చిన్నాపెద్ద కలిపి 250 వరకు టిఫిన్ సెంటర్లు ఉండగా.. పెద్దపల్లి జిల్లాలో 120, జగిత్యాలలో 180, సిరిసిల్లలో 200కు పైగా ఉన్నట్లు అంచనా. వీటితో పాటు మిల్లెట్ ఇడ్లీలు, మిల్లెట్ దోశలు ప్రస్తుతం పలు టిఫిన్ సెంటర్లలో ప్రత్యేకం.

జిల్లాలవారీగా 100 మంది చొప్పున పొద్దున ఏయే టిఫిన్లు తింటారని సర్వే చేయగా.. వెల్లడైన అంశాలివీ..













	కరీంనగర్	రాజన్న సిరిసిల్ల	జగిత్యాల జిల్లా..	పెద్దపల్లి జిల్లా
ఇడ్లీ, వడ	40	20	15	15
దోశ	25	25	30	30
పూరి	10	30	25	25
ఇడ్లీ	10	10	13	10
బోండ	10	15	17	15
ఊతప్ప	05			05

ఉద్యోగులు.. యువతే

పొద్దున్నే బయట టిఫిన్ చేసేవాళ్లలో ఎక్కువగా ప్రయివేటు ఉద్యోగులు, యువతే ఉన్నట్లు తెలుస్తోంది. వీరి తరువాత పట్టణాలకు పని నిమిత్తం వచ్చేవారు.. పట్టణాల్లో నివాసం ఉండేవారు, కాలేజీ యువత ఆసక్తి చూపుతున్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కమాన్, మంకమ్మతోట, జగిత్యాల రోడ్డు, మంచిర్యాల చౌరస్తా ప్రాంతాల్లోని టిఫిన్ సెంటర్లలో రద్దీ ఎక్కువగా ఉంటుంది. రాజన్న సిరిసిల్ల జిల్లాకేంద్రంలోని పాతబస్టాండు ప్రాంతంతోపాటు విమల్ టాకీస్ ఏరియా, మార్కెట్ ఏరియా, వేములవాడలో గుడి పరిసరాల్లో, జగిత్యాలలో మార్కెట్ ఏరియా, బస్టాండు ప్రాంతంలోని టిఫిన్ సెంటర్లలో రద్దీ ఎక్కువగా ఉంటుంది. పెద్దపల్లిలో జెండాగద్దె, బస్టాండు, గోదావరిఖని ప్రధాన చౌరస్తా ప్రాంతాల్లోని టిఫిన్ సెంటర్లలో రద్దీగా ఉంటుంది.

నైట్ టిఫిన్ సెంటర్లు



కరీంనగర్ జిల్లాకేంద్రంతో పాటు మిగితా ప్రాంతాల్లోనూ నైట్ టిఫిన్ సెంటర్లు పోటాపోటీగా వెలుస్తున్నాయి. కమాన్, బస్టాండ్, మార్కెట్ ప్రాంతం, జగిత్యాలరోడ్డులో నైట్ టిఫిన్ సెంటర్ల వద్ద రద్దీ కనిపిస్తుంది. హైవేల వెంట మొబైల్ టిఫిన్ సెంటర్లు నోరూరిస్తున్నాయి. ఉదయం, సాయంత్రం అందుబాటులో ఉంటున్నాయి.

ఇడ్లీవడ ఎక్కువగా..



నేను ఆటో డ్రైవర్‌ను. పొద్దున ఏడు గంటలకే ఇంట్లోంచి బయటికి వెళ్తా. అప్పటికి ఇంట్లో ఏం టిఫిన్ సిద్ధం చేయరు. దీంతో మా అడ్డాకి సమీపంలో కానీ.. అందుబాటులో ఉన్నచోట రోజూ టిఫిన్ చేస్తా. వారంలో మూడు, నాలుగు సార్లు ఇడ్లీవడ కాంబినేషన్ తింటా. అది తింటే త్వరగా జీర్ణమవుతుందని నా అభిప్రాయం.

- రాజు, ఆటో డ్రైవర్, కరీంనగర్

ఆరోగ్యం ముఖ్యం



ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా ముఖ్యం. ప్రస్తుతం ఏదైనా కల్తీగా మారుతోంది. నేను అడ్వోకేట్‌ను. పొద్దున లేస్తే చాలా బిజీగా ఉంటాను. అలా అని ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయను. ఇదివరకు సాధారణ టిఫిన్లు తినేవాన్ని. ఇప్పుడు పెద్దపల్లిలో మిల్లెట్ టిఫిన్స్ అందుబాటులోకి వచ్చాయి. దీంతో నేను ప్రతీరోజు మిల్లెట్ ఇడ్లీ లేకుంటే మిల్లెట్ దోశ తింటూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నా.

- వీ.ఎస్.మూర్తి, అడ్వోకేట్, పెద్దపల్లి

20 ఏళ్ల నుంచి ఈ వ్యాపారమే..



సిరిసిల్లలో 20 ఏళ్ల నుంచి టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నా. మా ఫ్యామిలీతో పాటు 20మందికి ఉపాధి కల్పిస్తున్నా. మా హోటల్‌లో పరోటా ఫేమస్. రోజూ బాగానే గిరాకీ ఉంటుంది. ఇతర ప్రాంతాల వారు కూడా సిరిసిల్లకు వచ్చినప్పుడు ఇక్కడే తింటారు.

- శ్రీనివాస్, టిఫిన్‌సెంటర్ యజమాని, సిరిసిల్ల

ఉదయం, సాయంత్రం గిరాకీ



కరీంనగర్‌లో మాది పేరున్న టిఫిన్ సెంటర్. ఉదయం సాయంత్రం రద్దీ ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం 12 వరకు, మళ్లీ 3గంటల నుంచి రాత్రి 11 గంటలవరకు గిరాకీ ఉంటుంది. ఉదయం ఊతప్ప, సాయంత్రం దోశ మా టిఫిన్ సెంటర్ ప్రత్యేకం. - ప్రసాద్, టిఫిన్ సెంటర్ నిర్వాహకుడు, కరీంనగర్

న్యూస్‌రీల్

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఐఈవో మోహన్

రుద్రంగి(వేములవాడ): పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని, కేంద్రంలో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు ఏర్పాటు చేయాలని డీఐఈవో సీహెచ్.మోహన్ పేర్కొన్నారు. శనివారం రుద్రంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీఈసీ-1 రాజేశ్వర్‌రావు, డీఈసీ-2, కళాశాల ప్రిన్సిపాల్ పులి గంగయ్య, పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ మడుపు నవీన్‌రెడ్డి, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ సురేష్, ఇన్విజిలేటర్స్ తదితరులు పాల్గొన్నారు.

రాములోరి పెళ్లి ఘనంగా నిర్వహిస్తాం



అధికారులతో సమావేశమైన ఈవో

వేములవాడ: వేములవాడ రాజన్న సన్నిధిలో ఈనెల 30న సీతారాముల కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని ఈవో కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. ఇందుకు అన్ని విభాగాల అధికారుల సహాయ సహకారాలు అవసరమని, గతంలోకంటే ఘనంగా ఉత్సవాలు నిర్వహించాలని పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, సెస్, ఎక్సైజ్, ఫైర్ శాఖల అధికారులకు విజ్ఞప్తి చేశారు. చైర్మన్ చాంబర్లో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కల్యాణోత్సవ వేదిక, రథోత్సవం ఏర్పాట్లు ఘనంగా నిర్వహిస్తామన్నారు. తహసీల్దారు రాజారెడ్డి, టౌన్ సీఐ వెంకటేశ్, స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ, ఏఈవో బి.శ్రీనివాస్, ప్రతాప నవీన్, జయకుమారి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సిరిసిల్లలో మహిళలే కీలకం



ప్రతిజ్ఞ చేస్తున్న చైర్‌పర్సన్ కళ, తదితరులు

సిరిసిల్లటౌన్: స్వచ్ఛ సిరిసిల్లలో మహిళల పాత్ర కీలకమైందని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్-2023లో భాగంగా మున్సిపల్ ఆధ్వర్యంలో స్వశక్తి గ్రూపుల సభ్యులు, మహిళ కౌన్సిలర్లతో స్వచ్ఛత ప్రదర్శన నిర్వహించగా ఆమె మాట్లాడారు. తడి, పొడి, హానికర చెత్తపై ప్రజల్లో చైతన్యం నింపాలన్నారు. వరుసగా జాతీయ అవార్డులు సాధిస్తున్న సిరిసిల్ల ఈ ఏడాది కూడా అదే పరంపర కొనసాగిస్తుందని పేర్కొన్నారు. ఇందుకు మహిళలు, స్వశక్తి సభ్యులు కృషి చేయాలన్నారు. అనంతరం స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు.

కల్యాణలక్ష్మి దేశానికే ఆదర్శం

సిరిసిల్లఅర్బన్: కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు దేశానికే ఆదర్శమని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అన్నారు. శనివారం సిరిసిల్ల మున్సిపల్ పరిధి 12వ వార్డు చంద్రంపేటలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పఠనాశక్తిని పెంచేందుకు పుస్తకాలు దోహదం

సిరిసిల్లఎడ్యుకేషన్: విద్యార్థుల్లో పఠనాశక్తిని పెంచేందుకు పుస్తకాలు దోహదం చేస్తాయని కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత డాక్టర్ పత్తిపాక మోహన్ అన్నారు. సిరిసిల్ల శివనగర్ పాఠశాలకు పీజీఎస్‌ఎఫ్ (ప్రకాశం గ్లోబల్ ఎన్నారై ఫోరం) వారిచే రూ.50 వేల విలువగల వెయ్యి పుస్తకాలను పాఠశాల గ్రంథాలయానికి వితరణ చేయగా, కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. డీఈవో రమేష్ మాట్లాడుతూ, పుస్తకాలు బాగా చదవడం వల్ల విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి పెంపొందుతుందని, విద్యార్థులు సొంతంగా పుస్తకాలు చదివి ఆలోచనాత్మకంగా పరీక్షలు రాయగలుగుతారని పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్వీ పరబ్రహ్మమూర్తి, మారసం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలగొండ రవి, కౌన్సిలర్ శ్రీనివాస్, ఎస్‌ఎంసి చైర్మన్ దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళకు ఆరోగ్య భాగ్యమే..!

- వ్యాధుల గుర్తింపు.. చికిత్సకు కార్యాచరణ
- ప్రతి మంగళవారం ప్రత్యేక సేవలు
- ఉమ్మడి జిల్లాలో 15 ఆసుపత్రులు
- ఆరోగ్య మహిళకు భారీ స్పందన



ప్రభుత్వాస్పత్రిలో ఆరోగ్య మహిళా సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు హరీశ్‌రావు, కమలాకర్ (ఫైల్)

ఉమ్మడి జిల్లాలో ఆరోగ్య మహిళ వివరాలు...

	కరీంనగర్	సిరిసిల్ల	జగిత్యాల	పెద్దపల్లి
ఆసుపత్రులు	03	04	05	03
చూసిన ఓపీ	414	201	501	164
చేసిన పరీక్షలు	260	60	253	47

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ మహిళల ఆరోగ్యం కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8న ప్రత్యేక కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆరోగ్య మహిళ పేరుతో రాష్ట్రవ్యాప్తంగా 100 ఆస్పత్రులను ప్రారంభించింది. ఇందులో అన్ని వయసుల మహిళలకు సంబంధించిన ఆరోగ్య సమస్యలపై ప్రత్యేక కార్యక్రమం చేపడుతున్నారు. వారికి వైద్య సేవల కోసం ప్రతి మంగళవారం ప్రత్యేకంగా క్లినిక్‌లను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఎనీమియా, క్యాన్సర్ నిర్ధారణ, పౌష్టికాహార లోపాన్ని గుర్తించడం, మూత్రాశయ సంబంధిత ఇన్‌ఫెక్షన్లు, మెనోపాజ్ సమస్యలు, లైంగిక సంబంధ వ్యాధులు, గర్భాశయ కణతులు, ఆర్థో, బరువుకు సంబంధించిన ఇబ్బందులు ఇలా ఒక్కో నెలలో ఒక్కో సమస్యపై కార్యక్రమం తీసుకుని వైద్య సేవలు అందిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 15 ఆసుపత్రులు

ఆరోగ్య మహిళ నిర్వహణ కోసం ఉమ్మడి జిల్లాలో 15 ఆసుపత్రులను ఎంపిక చేసి సేవలు కొనసాగిస్తున్నారు. కరీంనగర్ జిల్లాలో 3 ఆసుపత్రులు.. నగరంలోని బుట్టిరాజారాం కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రం, చొప్పదండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, చల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 4 ఆసుపత్రులు.. ఇందులో పట్టణంలోని సుందరయ్యనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం, వేములవాడ, తంగళ్లపల్లి, నేరెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జగిత్యాల జిల్లాలో 5 ఆసుపత్రులు.. ఇందులో పట్టణంలోని జీఎస్ రాంవెల్ పట్టణ ఆరోగ్య కేంద్రం, కొడిమ్యాల, నేరెళ్ల, అయిలాపూర్, కథలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పెద్దపల్లి జిల్లాలో 3 ఆసుపత్రులు.. ఇందులో పెద్దపల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రామగుండం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మంథనిలో గద్దెలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆరోగ్య మహిళ ఆసుపత్రులుగా మార్చారు. మిగతా సేవలకు ఇబ్బంది కలగకుండా ప్రతి మంగళవారం మాత్రం కేవలం మహిళల కోసమే ఆసుపత్రులను నిర్వహిస్తున్నారు.మహిళా వైద్యులు, సిబ్బందిని నియామకం చేశారు. అవసరమయ్యే పరికరాలను సమకూర్చారు.

మేజర్ సమస్య ఉంటే పెద్దాసుపత్రికి..

మహిళలకు సాధారణ సమస్యలు ఉంటే ఆరోగ్య కేంద్రంలోనే చికిత్స అందిస్తున్న వైద్యులు, మేజర్ ఆరోగ్య సమస్యలు ఉంటే పెద్దాసుపత్రికి రెఫర్ చేస్తున్నారు. క్యాన్సర్, గర్భాశయ సమస్యలు నిర్ధారణ అయిన వారిని సంబంధిత ఆసుపత్రులకు పంపించి చికిత్స అందేలా చర్యలు చేపడుతున్నారు. జిల్లాలో ఈనెల 8 నుంచి ఇప్పటివరకు 3 మంగళవారాలు ఎంపిక చేసిన ఆసుపత్రులలో వైద్య సేవలు అందించారు. ఆరోగ్య మహిళకు ఎంపిక చేసిన ఉమ్మడి జిల్లాలోని 15 ఆసుపత్రులలో ఇప్పటివరకు 1280 మందికి ఓపీ సేవలు అందించారు. ఇందులో 620 మందికి అవసరమైన పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించారు.

యాక్షన్ ప్లాన్‌లో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న గౌతంరెడ్డి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రానున్న ఎడాదికి గ్రామ సంఘాల విజన్ బిల్డింగ్‌లో అందరూ భాగస్వాములు కావాలని డీఆర్డీవో గౌతంరెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట ఎంపీడీవో కార్యాలయంలో శనివారం విజన్ బిల్డింగ్ యాక్షన్ ప్లాన్‌పై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఆరోగ్యం, పారిశుధ్యం తదితర వాటిపై దృష్టి కేంద్రీకరించాలని, ఇప్పటి నుంచి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చిరంజీవి, డీపీఎం సుధారాణి, శిక్షకులు రాజు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చే'నేత' కళ అద్భుతం

- హైకోర్టు జస్టిస్ సతీమణి సంఘమిత్రదాస్



చేనేత కళతో తయారైన చీరను ప్రదర్శిస్తున్న హరిప్రసాద్, తిలకిస్తున్న సంఘమిత్రదాస్, జడ్జిలు

సిరిసిల్లటౌన్: ఖండాంతరాల్లో పేరెన్నికగన్న సిరిసిల్ల చే'నేత' కళ అద్భుతమని హైకోర్టు జస్టిస్ ఉజ్జల్ భుయాన్ సతీమణి సంఘమిత్ర దాస్ అభివర్ణించారు. శనివారం సిరిసిల్లకు వచ్చిన ఆమెకు ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో జాతీయత భావం ఉట్టిపడేలా అగ్గిపెట్టెలో ఇమిడే చీరను స్థానిక చేనేత శిల్పి వెల్ది హరిప్రసాద్ ప్రదర్శించగా..ఆమె తిలకించి మాట్లాడారు. అగ్గిపెట్టెలో చీర వినడమే కానీ నేరుగా తిలకించడం మొదటిసారి అన్నారు. ఈసందర్భంగా హరిప్రసాద్‌ను అభినందించి సత్కరించారు. ఆమెతో వచ్చిన హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ కె.సుజనకి సిరిసిల్ల న్యాయమూర్తులు బహూకరించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.ప్రేమలత, సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ, జూనియర్ సివిల్ జడ్జి సౌజన్య, ఉజ్జల్ భుయాన్ కూతురు శ్వేత, కోర్టు ఏవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'ఫైర్ సేఫ్టీ'పై ఆడిట్ నిర్వహించాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలో ఫైర్ సేఫ్టీపై క్షేత్రస్థాయిలో ఆడిట్ నిర్వహించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఎస్పీ అఖిల్‌మహాజన్‌తో కలిసి అగ్ని ప్రమాదాల నివారణపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వేసవిలో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని, జిల్లాలోని వాణిజ్య భవనాలు, విద్యాసంస్థలు, ఆస్పత్రులు, గోదాములు, షాపులు, అపార్టుమెంట్లు, అన్ని ప్రభుత్వ ఆఫీస్‌లు, కలెక్టరేట్‌తో సహా అన్నింటా తనిఖీలు నిర్వహించి ఫైర్ సేఫ్టీపై రెండు వారాల్లో నివేదిక సిద్ధం చేయాలన్నారు. దీని కోసం ప్రత్యేక బృందాలను నియమిస్తున్నామని పేర్కొన్నారు. అన్ని చోట్ల ఫైర్ ఎగ్జిట్‌లు లాక్ కాకుండా ఉంచాలని, అత్యవసర మార్గాలు అందుబాటులో ఉండాలన్నారు. ఫైర్‌సేఫ్టీ పరికరాలు కండిషన్‌లో ఉన్నాయా.. లేవా పరిశీలించాలని సూచించారు. నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్పీ మాట్లాడుతూ, ప్రకృతి వైపరీత్యాలు, అగ్ని ప్రమాదాల్లో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా నివారించేందుకు జిల్లాలోని ఇద్దరు ఎస్సైలు, 10 మంది కానిస్టేబుళ్లకు హైదరాబాద్‌లో శిక్షణ ఇప్పించామన్నారు. అత్యవసర వేళల్లో ఈ బృందం స్పందిస్తుందని పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్, జిల్లా ఫైర్ ఆఫీసర్ వెంకన్న, డీపీవో రవీందర్, జిల్లా ఆస్పత్రి పర్యవేక్షకుడు డాక్టర్ మురళీధర్‌రావు, డీఈవో రమేశ్, డీఎంవో ప్రవీణ్, బీసీ, ఎస్సీడీవో మోహన్‌రెడ్డి, డీఎస్‌వో జితేందర్‌రెడ్డి, గురుకుల విద్యాలయాల కో ఆర్డినేటర్ జాక్వెలిన్, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, ఉప వైద్యాధికారి డాక్టర్ శ్రీరాములు, మైనార్టీ శాఖ ఓఎస్డీ సర్వర్‌మియా, సిరిసిల్ల, వేములవాడ ఫైర్ ఆఫీసర్లు సతీశ్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మృతుడి కుటుంబానికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం



నియామక పత్రం అందజేస్తున్న సారయ్య, తదితరులు

సిరిసిల్ల అర్బన్: సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌కు చెందిన చిటికెన నవీన్ ఈనెల 17న ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. కాగా బాధిత కుటుంబానికి అండగా ఉంటామని, కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగ భరోసా కల్పిస్తామని మంత్రి కేటీఆర్ అప్పుడు హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం నవీన్ కుటుంబంలో ఒక్కరికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాన్ని కల్పిస్తూ నియామక పత్రాన్ని బీఆర్ఎస్ జిల్లా ఇన్‌చార్జి బస్వరాజు సారయ్య అందజేశారు. ఆయన వెంట టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, చైర్‌పర్సన్ జిందం కళ, గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, రైతు బంధు సమితి అధ్యక్షుడు గడ్డం నర్సయ్య తదితరులు ఉన్నారు.

రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా హన్మాండ్లు



హన్మాండ్లును సన్మానిస్తున్న రేషన్ డీలర్లు

సిరిసిల్ల: జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా రెడ్డిమల్ల హన్మాండ్లు రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని నెహ్రూనగర్ భవాని ఫంక్షన్ హాల్‌లో ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్ష స్థానానికి రెడ్డిమల్ల హన్మాండ్లు ఒక్కరే నామినేషన్ వేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు గంద్ర బాలకిషన్‌రావు, మారం మహేశ్, గాజుల శ్రీనివాస్ ప్రకటించారు. ఈనెల 28న రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం కార్యవర్గ ఎన్నికలు, ప్రమాణ స్వీకారం ఉంటుందని హన్మాండ్లు తెలిపారు. తనకు రెండోసారి జిల్లా అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన రేషన్ డీలర్లకు కృతజ్ఞతలు తెలిపారు. రేషన్ డీలర్ల సంక్షేమానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

దుప్పిని కాపాడిన గ్రామస్తులు



దుప్పి వద్ద గ్రామస్తులు

కోనరావుపేట(వేములవాడ): కుక్కల బారిన పడిన ఓ దుప్పిని గ్రామస్తులు కాపాడి అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. మండలంలోని మరిమడ్లలో ఓ దుప్పి గ్రామ శివారులోకి వచ్చింది. దానిని చూసిన కుక్కలు దాడికి పాల్పడ్డాయి. కుక్కల బారినుంచి గ్రామస్తులు దుప్పిని కాపాడారు. అటవీశాఖ అధికారులకు సమాచారం అందించి అప్పగించారు. అటవీ ప్రాంతంలో ఉండే దుప్పి నీటికోసం గ్రామంలోకి వచ్చినట్లు భావిస్తున్నారు. కాగా ఇటీవల గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువ అవుతోందని, సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ఆందోళన

- రూ.లక్ష జరిమానా విధించడంపై వెల్లువెత్తిన నిరసన
- గుండెపోటుకు గురైన బాధితురాలు



కార్యాలయం ఎదుట గిరిజనుల ఆందోళన

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): గుడుంబా కేసులో బైండోవర్ చేసిన నిందితురాలికి రూ.లక్ష జరిమానా విధించడం వివాదాస్పదమైంది. మండలంలోని అల్మాస్‌పూర్ తండాకు చెందిన భూక్య కళ గుడుంబా విక్రయిస్తూ పట్టుబడగా గతేడాది ఏప్రిల్ 20న తహసీల్దార్ ఎదుట అధికారులు బైండోవర్ చేశారు. మరోసారి గుడుంబా అమ్మితే రూ.లక్ష చెల్లించాలనే నిబంధనలతో వ్యక్తిగత పూచీకత్తుపై విడిచిపెట్టారు. ఈ ఏడాది జనవరి 24న మరోసారి గుడుంబా అమ్ముతూ పట్టుబడింది. ఈనెల 21న కళను ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేయగా రూ.లక్ష జరిమానా చెల్లించడంతో విడుదల చేశారు. దీంతో మనోవేదనకు గురైన కళ గుండెపోటుకు గురైంది.

తండావాసుల ఆందోళన..

గుడుంబా అమ్మకందార్లలో భయం పుట్టించేందుకే భూక్య కళను అధికారులు ఇరికించారని ఆరోపిస్తూ శనివారం ఎల్లారెడ్డిపేటలోని ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం ఎదుట తండావాసులు ఆందోళనకు దిగారు. కార్యాలయంలోని ఫర్నిచర్‌ను బయట వేశారు. ఎక్సైజ్ సీఐ ఎంపీఆర్ చంద్రశేఖర్ బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మొదటి సారి బైండోవర్ చేసిన తర్వాత ఆమె సారా తయారీకి దూరంగా ఉందని, కూలీ పనులు చేసుకుంటున్న కళను అధికారులు కక్ష గట్టి అరెస్ట్ చేశారని పేర్కొన్నారు. అధికారులు రూ.లక్షను తిరిగి బాధితురాలికి చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకపోతే మూకుమ్మడిగా ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. డబ్బును చెల్లించకపోతే సోమవారం మరోసారి ఆందోళనకు దిగుతామన్నారు.

అప్పు చేసి కట్టింది..



అధికారుల ఇబ్బందులకు గురిచేయడంతో అప్పుచేసి రూ.లక్ష చెల్లించింది. అంత డబ్బు అప్పు తేవడంతో ఆందోళనకు గురైంది. రెండ్రోజుల క్రితం గుండెపోటు రాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. కళ చెల్లించిన డబ్బులు తిరిగి ఇవ్వాలి. ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించాలి.

– భూక్య లచ్చవ్వ, అల్మాస్‌పూర్ తండా

కళ కుటుంబానికి న్యాయం చేయాలి



భూక్య కళ కుటుంబానికి న్యాయం చేయకుంటే తండావాసులమంతా మూకుమ్మడిగా ఆత్మహత్య చేసుకుంటాం. గుడుంబా దొరకకుండా కావాలనే కేసులో ఇరికించారు. గిరిజనులకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపించాలి. గుడుంబా అమ్మితే రూ.లక్ష చొప్పున చెల్లించడం అన్యాయం. మంత్రి కేటీఆర్ స్పందించి కళ కుటుంబానికి న్యాయం చేయాలి.

– భూక్య రాజేశ్, అల్మాస్‌పూర్ తండా

ఆస్తులు ధ్వంసం చేస్తే కేసులు..



ఎక్సైజ్ కార్యాలయంలోకి వచ్చి ఆస్తులు ధ్వంసం చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. భూక్య కళ నిబంధనలు ఉల్లఘించడం వల్లే జరిమానా విధించాం. నిషేధిత గుడుంబాను అమ్మితే చర్యలు తీసుకుంటాం.

–ఎంపీఆర్ చంద్రశేఖర్, ఎక్సైజ్ సీఐ, ఎల్లారెడ్డిపేట

బాలికలు బాగా చదువుకోవాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్



బాలికలతో ఎస్పీ అఖిల్ మహాజన్

వేములవాడ/వేములవాడరూరల్: బాలికలు బాగా చదివి ఉన్నత శిఖరాలు అందుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమయాన్ని వృథా చేయకుండా లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. స్మార్ట్‌ఫోన్లు, సోషల్ మీడియాకు దూరంగా ఉండేందుకు ప్రయత్నించాలన్నారు. తమ ఫెయిల్యూర్‌ని చింతించకుండా దాన్ని అధిగమించేందుకు కృషి చేయాలన్నారు. జిల్లాలో షీటీమ్‌లు సమర్థవంతంగా పని చేస్తున్నాయని, మహిళలను జాగృతపరిచేందుకు రోజూ సమావేశాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. బాలికలు, యువతులు, మహిళలకు ఏవైనా వేధింపులు, ఇబ్బందులు ఎదురైతే తప్పకుండా పోలీసులను సంప్రదించాలన్నారు. జిల్లా షీటీమ్ 87126 56425 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ నాగేంద్రచారి, టౌన్ సీఐ వెంకటేశ్, ప్రిన్సిపాల్ స్వప్న, ఎస్సైలు రఫీక్‌ఖాన్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల మన్ననలు పొందేలా పని చేయాలి

సిరిసిల్లక్రైం: విధి నిర్వహణలో పోలీస్ అధికారులు, సిబ్బంది క్రమశిక్షణ, నిబద్ధతతో పని చేస్తూ ప్రజల మన్ననలు చూరగొనాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఆర్మ్‌డ్ రిజర్వ్, సివిల్ పోలీస్, హోంగార్డ్ సిబ్బంది వీక్లీ పరేడ్‌కు హాజరై మాట్లాడారు. రోజూ ఉదయం కనీసం అరగంట యోగా, ధ్యానం, వాకింగ్ చేయాలన్నారు. వీక్లీ పరేడ్ సిబ్బందికి క్రమశిక్షణ, సమష్టిగా ఉండడం, శారీర దృఢత్వానికి ఉపయోగపడుతుందన్నారు. సిబ్బందికి ఏదైనా సమస్య ఉంటే ఎప్పుడైనా తనకు తెలియజేయొచ్చని, పరిష్కరిస్తానని పేర్కొన్నారు. పరేడ్‌లో అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆర్ఐలు కుమారస్వామి, రజినీకాంత్, యాదగిరి, సీఐలు అనిల్‌కుమార్, నవీన్‌కుమార్, మధుకర్ పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం



మాట్లాడుతున్న డీఈఓ రమేశ్

సిరిసిల్లఎడ్యుకేషన్: యోగాతో మానసిక ఒత్తిడిని దూరం చేసుకోవచ్చునని జిల్లా విద్యాధికారి రమేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని నెహ్రూనగర్ పాఠశాలలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న యోగా శిక్షణ ముగింపు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. అరుణ యోగా రీసెర్చ్ అకాడమీకి చెందిన యశ్వంత్, సాయిరత్న జిల్లాలోని వ్యా యామ ఉపాధ్యాయులకు ధ్యానం, ప్రాణాయామం,యోగాసనాలు, సూర్య నమస్కారాలు మొదలైన అంశాలపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. శిక్షణలో నేర్చుకున్న ఉపాధ్యాయులు వారి పాఠశాలల్లోని విద్యార్థులకు ఒత్తిడిని ఎదుర్కోవడం, ఏకాగ్రత వంటి వాటిలో తర్ఫీదు ఇవ్వవచ్చని అభిప్రాయపడ్డారు. యోగా గురువు అరుణ మాట్లాడుతూ, యో గాతో ఆరోగ్యవంతమైన జీవితం కొనసాగించవచ్చని వివరించారు. ఐదు రోజులపాటు జరిగిన శిక్షణలో మోడల్ స్కూల్, కేజీబీవీ, జిల్లా పరిషత్ పాఠశాలల నుంచి వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

ముస్తాబాద్(సిరిసిల్ల): పదో తరగతిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా చదవాలని డీఈవో రమేశ్ అన్నారు. ముస్తాబాద్‌లో కస్తూరిబా బాలికల విద్యాలయాన్ని శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాలు, స్నాక్స్‌ను పరిశీలించారు. పత్యేకాధికారి శ్రీలత, ఉపాధ్యాయులు హైమవతి, ఆశ తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని వెంకట్రావుపేట– కొండాపూర్ గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయాలపాలయ్యారు. వీర్నపెల్లి మండలం గర్జనపల్లికి (జవహర్‌లాల్ నాయక్ తండా) చెందిన భుక్యా పండరి, సమీప బంధువైన అజ్మీరా సుజాత (కెలోత్ తండా, వన్‌పల్లి)తో కలిసి ద్విచక్రవాహనంపై సిరిసిల్లకు వెళ్తున్నారు. కొండాపూర్ కాజ్‌వే సమీపంలో రోడ్డు పక్కనే విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో పండరి కాలు విరుగగా, సుజాత తలకు గాయాలయ్యాయి. సమీపంలోని హనుమాన్‌తండాకు చెందిన గిరిజనులు గమనించి గాయపడిన ఇద్దరిని సిరిసిల్ల జిల్లా ఆస్పత్రికి తరలించారు.

పరిమితికి మించి ప్రయణికులను తరలిస్తే చర్యలు

- వేములవాడ రూరల్ ఎస్సై నాగరాజు
- ఆటో డ్రైవర్‌పై కేసునమోదు

వేములవాడ రూరల్: వాహనదారులు పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే కేసులు నమోదు చేస్తామని వేములవాడ రూరల్ ఎస్సై నాగరాజు అన్నారు. శనివారం వేములవాడ మండలంలోని నాగాయపల్లి గ్రామం వద్ద విద్యార్థులను పరిమితికి మించి తరలిస్తూ ప్రమాదానికి కారకుడైన ఆటో డ్రైవర్ లక్ష్మీ నారాయణపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఎవరైనా పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

50 ట్రిప్పుల ఇసుక డంప్ సీజ్

వేములవాడ/వేములవాడరూరల్: మండలంలోని జయవరం వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 50 ట్రిప్పుల ఇసుకను సీజ్ చేసినట్లు టౌన్ సీఐ వెంకటేశ్ శనివారం తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేసినా, నిర్మాణాలు లేకున్నా ఇసుక డంప్‌లను ఏర్పాటు చేసినా సీజ్ చేస్తామని పేర్కొన్నారు.

బార్ అసోసియేషన్‌కు ఏడుగురు ఏకగ్రీవం



ప్రతాప సంతోష్



తోట శేఖర్

వేములవాడ: వేములవాడ అడ్వకేట్స్ అసోసియేషన్ నామినేషన్ల పర్వం, ఉపసంహరణ పర్వం శనివారంతో ముగిసింది. ఏడుగురు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి సదానందం ప్రకటించారు. ఈనెల 28న ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు ఎన్నికలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఏకగ్రీవంగా ఎన్నికైంది వీరే..

వేములవాడ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ప్రతాప సంతోష్, జాయింట్ సెక్రెటరీగా జంగం అంజయ్య, కోశాధికారిగా బొజ్జ నరేశ్, స్పోర్ట్స్ సెక్రెటరీగా గడ్డం సత్యనారాయణరెడ్డి, మహిళా ప్రతినిధిగా టి.అన్నపూర్ణ, జూనియర్ ఈసీ మెంబర్లుగా తోట శేఖర్, జెట్టి శేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

బరిలో ఉన్నవారు..

వేములవాడ బార్ అసోసియేషన్ ఎన్నికల బరిలో నిలిచిన తుది జాబితాను ఎన్నికల అధికారి సదానందం శనివారం ప్రకటించారు. అధ్యక్ష స్థానానికి పెంట రాజు, పిట్టల మనోహర్, వేముల సుధాకర్, జనరల్ సెక్రెటరీకి నక్క దివాకర్, పి.భాను, లైబ్రరీ సెక్రెటరీకి బొజ్జ మహేందర్, గుజ్జ మనోహర్, రాజూరి రమేశ్, సీనియర్ ఈసీ మెంబర్లకు కె.నర్సింగారావు, దొబ్బల ప్రవీణ్, నాగుల సంపత్, నరాల శ్రీనివాస్ బరిలో ఉన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై బస్సుయాత్ర

- సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్



మాట్లాడుతున్న రమేశ్

సిరిసిల్లటౌన్: కేంద్ర సర్కారు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఎం నిరంతరం పోరాడుతుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ అన్నారు. పార్టీ చేపడుతున్న బస్సుయాత్ర ఆదివారం సిరిసిల్లకు చేరుకుంటుందని పేర్కొన్నారు. ఈమేరకు శనివారం సిరిసిల్లలోని పార్టీ ఆఫీసులో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్లో మాట్లాడారు. ఉదయం 9గంటలకు సిరిసిల్లకు బస్సుయాత్ర చేరకుంటుందని, కొత్తబస్టాండు వద్ద సాదర స్వాగతం పలికి అంబేడ్కర్ చౌరస్తా, నేతన్న చౌక్, గాంధీచౌక్, కొండాలక్ష్మన్ బాపూజీ చౌక్ మీదుగా మున్సిపల్ పక్కన గల లేబర్ అడ్డావరకు పెద్దెత్తున ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. అక్కడ జరిగే బహిరంగ సభలో సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.వీరయ్య, ఆశయ్య, స్కైలాబ్‌బాబు, జయలక్ష్మి, జగదీశ్, అడివయ్య, బాలకృష్ణతో పాటు ప్రజానాట్య మండలి కళాకారులు పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమానికి కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, విద్యార్థులు, మేధావులు అన్ని వర్గాల ప్రజలు హాజరు కావాలని కోరారు. సమావేశంలో జిల్లా నాయకులు కోడం రమణ, మోర అజయ్, గణేష్, నాగరాజు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ నిర్మాణానికి ఏర్పాట్లు

సాక్షి ఎఫెక్ట్



శిథిలమైన బడిని కూల్చివేస్తున్న దృశ్యం

ముస్తాబాద్(సిరిసిల్ల): మండలంలోని పోతుగల్‌లో అంబేద్కర్‌నగర్ ప్రాథమిక పాఠశాల నూతన భవనానికి అధికారులు, ప్రజాప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏళ్ల క్రితం నిర్మించిన స్కూల్ బిల్డింగ్ శిథిలావస్థకు చేరుకోగా.. చెట్ల కింద చదువులపై 'సాక్షి'లో 23 సెప్టెంబర్ 22లో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన మంత్రి కేటీఆర్ బడి దుస్థితిపై పీఎస్ శ్రీనివాస్‌ను పరిశీలనకు పంపించారు. ఎప్పుడు కూలుతుందో తెలియని బిల్డింగ్‌ను వదిలి చెట్ల కింద తరగతులు నిర్వహిస్తున్న దృశ్యాన్ని చూశారు. హెచ్ఎం మల్లేశంతో మాట్లాడారు. కొత్త భవనం నిర్మాణానికి పీఆర్ అధికారులతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రూ.22లక్షలతో రెండు తరగతి గదులు నిర్మించేందుకు సీఎస్ఆర్ గ్రాంటు ద్వారా పనులు మొదలు పెట్టారు. ఈమేరకు శిథిలమైన బడి భవనాన్ని శనివారం జేసీబీతో కూల్చివేశారు. జీ ప్లస్‌వన్ పద్ధతిలో భవనాన్ని నిర్మిస్తామని ఏఈ నాగరాజు తెలిపారు. మూడు నెలల్లో గదులు సిద్ధం చేస్తామని పేర్కొన్నారు.

సాగునీటి కోసం రోడ్డెక్కిన రైతులు



ధర్నా చేస్తున్న రైతులు

చందుర్తి (వేములవాడ): సాగునీటి కోసం చందుర్తి మండలం నర్సింగాపూర్ రైతులు ఎండిన వరి పిలకలతో శనివారం రోడ్డెక్కారు. వెంటనే ఎల్లంపల్లి నీటిని విడుదల చేయాలంటూ వేములవాడ–కోరుట్ల ప్రధాన రహదారిలో మూడపల్లి బస్టాండ్ వద్ద ఆందోళనకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నెల రోజుల క్రితమే ఎల్లంపల్లి నీళ్ల అందిస్తామని ప్రకటించి, ఇప్పటి వరకు విడుదల చేయకపోవడంతో భూగర్భజలాలు అడుగంటి నీరందక వరి పొలాలు ఎండిపోతున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు. రెండుగంటల పాటు బైఠాయించడంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు జోక్యం చేసుకుని ధర్నా విరమించాలని కోరినా రైతులు వినిపించుకోలేదు. తహసీల్దార్ రావాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో అక్కడికి చేరుకున్న తహసీల్దార్ మజీద్ ఎల్లంపల్లి ప్రాజెక్టు అధికారులతో మాట్లాడి ఐదారు రోజుల్లో నీటిని విడుదల చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కాసారపు శ్రీనివాస్‌రెడ్డి, భాగ్యలక్ష్మి, సుగుణవ్వ, రాజవ్వ, రాధవ్వ, పూడూరి జీవన్‌రెడ్డి, పెరుక గంగరాజు, చిట్యాల రాజు, మామిడాల శ్రీనివాస్, పూడూరి అజయ్, ప్రశాంత్, లింగారెడ్డి, పర్శరాములు, తిరుపతి, రాజు, శ్రీనివాస్, పూడూరి దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెరుకుపంట దగ్ధం



కాలిపోయిన చెరుకుపంట వద్ద నాగరాజు

కోనరావుపేట(వేములవాడ): ఆరుగాలం శ్రమించి సాగు చేసుకున్న పంట కాలిబూడిదైంది. మండలంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన రైతు జవ్వాజి నాగరాజు తనకున్న నాలుగున్నర ఎకరాల్లో చెరుకు పంటను సాగు చేశాడు. పంట కోతకు రావడంతో సుమారు రెండున్నర ఎకరాలు కోయించాడు. ఇంకా రెండెకరాల పంట కోతకు సిద్ధంగా ఉంది. త్వరలోనే పంటను కోద్దామనుకుంటుండగా శనివారం అకస్మాత్తుగా పంటకు నిప్పంటుకుని కాలిపోయింది. పక్కనే ఉన్న మూడు తాటిచెట్లకు కూడా మంటలు అంటుకుని కాలిపోయాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.రెండున్నర లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు పేర్కొన్నాడు. అయితే ఇది ప్రమాదవశాత్తు జరిగిందా లేక గుర్తుతెలియని వ్యక్తులు కావాలని చేశారా అని రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పరిశీలించి తనకు పరిహారం అందించాలని రైతు కోరుతున్నాడు.

'బలగం' విజయోత్సవ సంబరం



విజయోత్సవ ర్యాలీలో బలగం చిత్ర యూనిట్

సిరిసిల్లకల్చరల్: జిల్లా వాసి వేణు ఎల్దండి దర్శకత్వంలో విజయవంతంగా ప్రదర్శింపబడుతున్న బలగం చిత్ర బృందం శనివారం సిరిసిల్లలో సందడి చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా విశేష జనాదరణ పొందుతున్న సందర్భంగా సాయంత్రం జిల్లా కేంద్రంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సినిమా ప్రదర్శితం అవుతున్న నటరాజ్ థియేటర్‌లో ఫస్ట్ షో అయ్యాక ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు. నటీనటులు ప్రియదర్శి, కావ్యతో పాటు చిత్రంలోని ఇతర పాత్రధారులు వేదికపై కనిపించి ప్రేక్షకులను ఆశ్చర్యంలో ముంచెత్తారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ మాట్లాడుతూ, ఇంటింటి కథను తెరకెక్కించి బరువైన దృశ్యాలతో కంట తడి పెటించిన వేణు ఎల్దండి ప్రతిభను ప్రశంసించి ఉద్వేగానికి లోనయ్యారు. చిత్ర బృందం కృషిని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, రాష్ట్ర పవర్‌లూమ్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మళ్లీ వడగండ్ల వర్షం



మరిమడ్లలో దెబ్బతిన్న టమాట పంట



నేల రాలిన వడ్లు

కోనరావుపేట/రుద్రంగి/వీర్నపల్లి: జిల్లాలో శనివారం సాయంత్రం మళ్లీ వడగండ్ల వాన కురిసింది. కోనరావుపేట మండలం మరిమడ్లలో పలువురు రైతులు సాగు చేసిన వరి, టమాట తదితర పంటలు దెబ్బతిన్నాయి. అందె నర్సయ్య ఇంటిపైకప్పు రేకులు కొట్టుకుపోయాయి. రుద్రంగి మండలంలో ఈదురుగాలులకు అక్కడక్కడ చెట్లు విరిగి రోడ్డుపై పడ్డాయి. మండల కేంద్రంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వీర్నపల్లి మండలం గర్జనపల్లి, వన్‌పల్లి, శాంతినగర్‌లో వరి పొలాలు, ఇతర పంటలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరారు.